క్లుప్తంగా

ఘనంగా పెద్దమ్మ దేవర


ప్రత్యేక అలంకరణలో పెద్దమ్మ తల్లి

పెనుకొండ రూరల్: మండలంలోని మునిమడుగు పంచాయతీ చిన్నపరెడ్డిపల్లిలో మంగళవారం పెద్దమ్మ తల్లి దేవరను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. మహిళలు అమ్మవారికి జ్యోతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. చిన్నపరెడ్డిపల్లితో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున దేవరలో పాల్గొన్నారు. ఎమ్మెల్సీ మంగమ్మ, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర, నగర పంచాయతీ వైస్ చైర్మన్ సునీల్, సర్పంచ్ అశ్వర్థనారాయణ, వైస్ సర్పంచ్ వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, నాయకులు రామ్మోహన్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాము, ప్రసాదరెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఏఎంసీ చెక్‌పోస్టు ఏర్పాటుకు స్థల పరిశీలన

మడకశిరరూరల్: మండల పరిధిలోని యూ రంగాపురం వద్ద ఏఎంసీ చెక్ పోస్టు ఏర్పాటు చేసేందుకు మంగళవారం ఏడీఎం నరసింహ మూర్తి, తాలుకా ఆఫీసర్ నాగేంద్రకుమార్ స్థలాన్ని పరిశీలించారు. పట్టణంలోని వైబీ హళ్లి క్రాస్‌లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టును కర్ణాటక సరిహద్దు యూ రంగాపురం వద్దకు మార్పు చేయడానికి స్థలాన్ని పరిశీలించామన్నారు.

వ్యక్తిగత శుభ్రత ముఖ్యం


హిందూపురం: అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి డాక్టర్ మంజుశ్రీ

హిందూపురం టౌన్: ఋతుక్రమం శారీరక ధర్మమని, ఆడపిల్లలకు వ్యక్తిగత శుభ్రత ఎంతో ముఖ్యమని లక్ష్మీపురం పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి మంజుశ్రీ తెలిపారు. మంగళవారం స్థానిక లక్ష్మీపురం పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఋతు శుభ్రతా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు, యుక్తవయసు ఆడపిల్లలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

పరిగి: వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మెడికల్ ఆఫీసర్ నవీన తెలిపారు. పరిగిలో మంగళవారం ఋతు శుభ్రతా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యారోగ్యశాఖ అధికారుల ఆధ్వర్యంలో మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వన్నప్ప, పీహెచ్‌ఎన్ వెంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిలమత్తూరు: మండల పరిధిలోని దేమకేతేపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల నేపథ్యంలో బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో డీఈ రంగయ్య తెలిపారు. దేమకేతేపల్లి, యగ్నిశెట్టిపల్లి, ఇండస్ట్రీయల్ ఫీడర్స్‌లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. రైతులు, ప్రజలు సహకరించాలని కోరారు.

విశ్రాంత హెచ్ఎం మృతి


రంగయ్య (ఫైల్)

పావగడ: తాలూకాలోని దేవరబెట్ట గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఆర్ రంగయ్య (79) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. ఆయన హాసన్ జిల్లా సకలేశపుర, కోలార్‌లో పాటు పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో హెచ్ఎంగా విధులు నిర్వహించారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రంగయ్య మృతి పట్ల ఎమ్మెల్యే వెంకటేష్, మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప, మాజీ మంత్రి వెంకటరమణప్ప, ఉపాధ్యాయులు సంతాపం ప్రకటించారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


శస్త్ర చికిత్సకు ఎంపికైన వారు

పావగడ: తాలూకాలోని వదనకల్లులో స్థానిక హెల్ప్ సొసైటీ, శంకర కంటి ఆస్పత్రి సంయుక్తంగా మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 90 మందిని పరీక్షించిన వైద్యులు 50 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. వారిని బెంగళూరులోని శంకర కంటి ఆస్పత్రికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో హెల్ప్ సొసైటీ అధ్యక్షుడు మానం శశికిరణ్, శంకర కంటి ఆస్పత్రి వైద్యుడు అభిషేక్, నిర్వాహకుడు హరీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విత్తన పంపిణీకి సిద్ధం

- నేటి నుంచి ఆర్బీకేల పరిధిలో విత్తన వేరుశనగ పంపిణీ
- 9,949 మంది రైతులు పేర్లు నమోదు
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



మడకశిర: మడకశిర వ్యవసాయ డివిజన్ పరిధిలో బుధవారం నుంచి రైతులకు వేరుశనగ విత్తన కాయల పంపిణీ ప్రక్రియను వ్యవసాయశాఖ అధికారులు ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఇప్పటికే అధికారులు పూర్తి చేశారు. ఆయా ఆర్బీకేల పరిధిలోనే విత్తనాన్ని అందించనున్నారు. నియోజకవర్గంలో 71 ఆర్బీకేలు ఉన్నాయి. ప్రస్తుతం వేరుశనగ విత్తన కాయలు దాదాపు 45 ఆర్బీకేలకు సరఫరా చేశారు. ఈ ఆర్బీకేల పరిధిలో విత్తనాన్ని రైతులకు పంపిణీ చేయనున్నారు. ముఖ్యంగా ఆర్బీకేల్లో విత్తనం కోసం పేర్లు నమోదు చేసుకున్న రైతులకే విత్తనం అందిస్తారు. ఇదిలా ఉండగా 9,949 మంది రైతులు విత్తనం కోసం పేర్లు నమోదు చేసుకున్నారు. వీరికి 8,446.50 క్వింటాళ్ల విత్తన కాయలు అందించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. సకాలంలో రైతులకు ప్రభుత్వం విత్తనం అందించడానికి ఏర్పాట్లు చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. డిమాండ్ మేరకు రైతులకు విత్తన కాయలను అందిస్తామని స్థానిక ఏడీఏ కృష్ణమీనన్ తెలిపారు. విత్తనం అవసరమైన రైతులు ఆర్బీకేల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

వేరుశనగ విత్తనం కోసం పేర్లు నమోదు చేసుకున్న రైతుల వివరాలు

మండలం	రైతుల సంఖ్య	విత్తనం (క్వింటాళ్లలో)
మడకశిర	3,125	2,590.20
అమరాపురం	1,868	1,637.70
గుడిబండ	2,715	2,328.60
రొళ్ల	1,081	918.60
అగళి	1,160	971.40
మొత్తం	9,949	8,446.50

మడకశిర ప్రాంతంలో పంపిణీ చేసే కే-6 వేరుశనగ విత్తన ధరలు ఇలా

(40 శాతం సబ్సిడీ పోను)

బస్తా (30 కేజీలు): రూ.1,710

రెండు బస్తాలు (60 కేజీలు):రూ.3,420

మూడు బస్తాలు (90 కేజీలు):రూ.5,130

ఆర్బీకేల ద్వారా ఎరువుల పంపిణీకి చర్యలు


అమరాపురం మండలం బసవనపల్లి ఆర్బీకేలో నిల్వ చేసిన ఎరువులు

మడకశిర నియోజకవర్గవ్యాప్తంగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. రైతులు ఖరీఫ్ వ్యవసాయానికి సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో రైతులు సాగు చేసే వివిధ పంటలకు ఎరువుల కొరత ఏర్పడకుండా ఏర్పాట్లు చేసింది. ఆర్బీకేల ద్వారా ఎరువులను పంపిణీ చేయడానికి చర్యలు ప్రారంభించింది. వేరుశనగ పంట సాగుకు అవసరమైన డీఏపీ, కాంప్లెక్స్, పొటాష్ ఎరువులను రైతులకు అందిస్తున్నారు. మిగిలిన పంటల సాగుకు అవసరమైన యూరియాను కూడా ఆర్బీకేల్లో రైతులకు సిద్ధంగా ఉంచారు. అగళి మండలానికి యూరియా 3.6, డీఏపీ 14.55, కాంప్లెక్స్ 17.7, పొటాష్ 4.75 మెట్రిక్ టన్నుల ఎరువులను ప్రభుత్వం సరఫరా చేసింది. అలాగే అమరాపురం మండలానికి యూరియా 9.27, డీఏపీ 5.3, కాంప్లెక్స్ 0.1, పొటాష్ 13.3 మెట్రిక్ టన్నులను అందించారు. గుడిబండ మండలానికి యూరియా 22.185, డీఏపీ 6.3, కాంప్లెక్స్ 9.5, పొటాష్ 3.05 టన్నులను ప్రభుత్వం కేటాయించింది. మడకశిర మండలానికి యూరియా 45.18,డీఏపీ 5.55, కాంప్లెక్స్ 5.65 టన్నులు, రొళ్ల మండలానికి యూరియా 14.49, డీఏపీ 13.25, కాంప్లెక్స్ 14.9 టన్నుల చొప్పున కేటాయించినట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. మొత్తం నియోజకవర్గానికి యూరియా 94.725, డీఏపీ 44.95, కాంప్లెక్స్ 47.85, పొటాష్ 21.10 మెట్రిక్ టన్నుల చొప్పున కేటాయించిందన్నారు. డిమాండ్ మేరకు రైతులకు అన్ని రకాల ఎరువులను అందించనున్నట్లు మడకశిర ఏఓ తిమ్మప్ప తెలిపారు. అవసరమైన రైతులు ఆర్బీకేలకు వెళ్లి ఎరువులను కొనుగోలు చేయవచ్చన్నారు.

మడకశిరలో 1,644 బైండోవర్ కేసులు

మడకశిర: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా నియోజకవర్గంలో 1,644 బైండోవర్ కేసులను పోలీసులు నమోదు చేశారు. వివిధ కేసుల్లోని నిందితులు, రౌడీషీటర్లపై బైండోవర్ కేసులను నమోదు చేశారు. మడకశిర రూరల్ సర్కిల్ పరిధిలో 1,149 బైండోవర్ కేసులను నమోదు చేసినట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. ఎన్నికలకు ముందు గుడిబండ మండలంలో 3, అగళిలో ఒక కేసును నమోదు చేశామన్నారు. ఇదిలా ఉండగా మడకశిర అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కూడా 495 బైండోవర్ కేసులను నమోదు చేశామని సీఐ మనోహర్ తెలిపారు. కౌంటింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని కోరారు.

మూడిళ్లలో దొంగతనం


ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం బృందం

సోమందేపల్లి: మండలంలోని పాత ఊరులో వరుసగా మూడు ఇళ్లలో చోరీలు జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. భాస్కర్ నివాసంలో 8 తులాల బంగారు రూ.7 వేలు నగదు, రిఫియా నివాసంలో రూ.20 వేలు నగదు, పూల గంగరత్నమ్మ నివాసంలో రూ.2 వేల నగదు, తులం బంగారాన్ని దొంగలు ఎత్తుకెళ్లారు. ఇళ్లకు తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లిన క్రమంలో ఆదివారం రాత్రి దొంగలు మూడిళ్లలో చోరీకి పాల్పడ్డారు. ఎస్‌ఐ విజయ్‌కుమార్ చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించారు. క్లూస్ టీం సిబ్బంది చేరుకొని ఆధారాలను సేకరించారు. గ్రామంలో వరుస చోరీలతో ప్రజలు ఆందోళనకు గరవుతున్నారు.

రాష్ట్రంలో మళ్లీ 'ఫ్యాన్' ప్రభంజనమే

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప


వైఎస్సార్‌సీపీ శ్రేణులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

అగళి: పోలింగ్ సరళిని పరిశీలిస్తే రాష్ట్రంలో మళ్లీ ఫ్యాన్ ప్రభంజనం సృష్టించబోతున్నట్లు స్పష్టమవుతోందని ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప అన్నారు. మంగళవారం మండల పరిధిలోని హెచ్‌డీ హళ్లీ తండాలో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో ఆయన సమావేశమయ్యారు. తొలుత కాలమ్మ, యల్లమ్మ, దుర్గమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్, ఎంపీపీ భర్త కామరాజు, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మహేంద్రప్ప, సర్పంచ్ రామకృష్ణప్ప ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్పను సన్మానించారు. ఎమ్మెల్యే అభ్యర్థి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంతో ఐదేళ్లు సీఎం జగన్ పనిచేశారన్నారు. కుల, మతాలకతీతంగా అన్ని వర్గాల ప్రజలకు ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలను అందించిన ఘనత జగన్‌దేనన్నారు. ముఖ్యంగా మహిళలకు అనేక పథకాలు అందించారని వివరించారు. దీంతో మహిళలు పెద్ద ఎత్తున ఓటింగ్‌లో పాల్గొని వైఎస్సార్‌సీపీకే ఓటు వేశారన్నారు. 2019లో వచ్చిన ఫలితాల కంటే మడకశిరలో వైఎస్సార్‌సీపీకి అత్యధిక మెజార్టీ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటస్వామి, హనుమంతరాయ, రామనాయక్, సురేష్, బాలనాయక్, కుమార్, వెంకటేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

జగన్ మళ్లీ సీఎం కావడం ఖాయం


సమావేశంలో మాట్లాడుతున్న వేణురెడ్డి


సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

లేపాక్షి: 'సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో వైఎస్సార్ సీపీ మరోసారి ఘన విజయం సాధిస్తుంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారు. హిందూపురంలో కూడా మొదటిసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయబోతున్నాం' అని వైఎస్సార్‌సీపీ నాయకుడు, హిందూపురం ఎమ్మెల్యే అభ్యర్థి భర్త వేణురెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఉదయం లేపాక్షిలోని షాదీమహాల్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయడంతో ఎమ్మెల్యే అభ్యర్థి దీపికా హిందూపురంలో గెలవబోతున్నట్లు ధీమా వ్యక్తం చేశారు. కష్టపడి పనిచేసినా ప్రతి ఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. కౌంటింగ్ పూర్తయిన తర్వాత కూడా నిబంధనలకు లోబడి ఉండాలన్నారు. లేకపోతే కేసుల్లో చిక్కుకుని ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నారాయణ స్వామి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ లీలావతి, సర్పంచులు ఆదినారాయణ, అశ్వత్థ నారాయణ, మంజునాథ్, ఎంపీటీసీ సభ్యుడు అశ్వత్థప్ప, ఆదినారాయణ, మండల వ్యవసాయ సలహా కమిటీ అధ్యక్షుడు ప్రభాకర్, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు నారాయణస్వామి, కోఆప్షన్ సభ్యులు బషీర్, నాయకులు తిప్పన్న, వేణుగోపాల్ రెడ్డి, శంకరప్ప, చలపతి, ఇర్ఫాన్, నిస్సార్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ నిర్మించొద్దని ఆందోళన

- మూడు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని బాధితులకు జేసీ హామీ


జాయింట్ కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న బాధితులు

గోరంట్ల: మండల పరిధిలోని గుమ్మయ్యగారిపల్లి సమీపంలో హిందూపురం – గోరంట్ల ప్రధాన రహదారి పక్కన చాంద్ ఫంక్షన్ హాల్ వద్ద ఇటీవల జాతీయ రహదారి (342)కి సంబంధించి హైవే అధికారులు మార్కింగ్ వేశారు. అయితే చాంద్ ఫంక్షన్ హాల్ సమీపంలో ఫ్లైఓవర్ నిర్మించాలని తాజాగా మరోసారి ప్లాన్ మార్కు చేశారు. బ్రిడ్జి నిర్మిస్తే తమ విలువైన భవనాలు కోల్పోతామని వెంటనే హైవే అధికారులు అలైన్‌మెంట్ మార్చాలని మంగళవారం స్థానికులు హిందూపురం – గోరంట్ల ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. అదేదారి వెంట పెనుకొండకు వెళ్తున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ బాధితుల సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఫ్లైఓవర్ నిర్మాణం కోసం అధికారులు వేసిన మార్కును కూడా ఆయన పరిశీలించారు. హైవే అధికారులతో పాటు ఉన్నతాధికారులతో చర్చించి మూడు రోజుల్లోపు సమస్య పరిష్కరిస్తామని జేసీ హామీ ఇవ్వడంతో బాధితులు ఆందోళన విరమించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే పాఠశాలలు సీజ్ చేస్తాం


శ్రీచైతన్య పాఠశాలను తనిఖీ చేస్తున్న డీవైఈఓ రంగస్వామి

హిందూపురం టౌన్: ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని, పాఠశాలను సీజ్ చేస్తామని డీవైఈఓ రంగస్వామి హెచ్చరించారు. పుస్తకాలు, విద్య సామగ్రి విక్రయిస్తున్నారనే ఫిర్యాదుతో మంగళవారం పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలను ఎంఈఓ గంగప్పతో ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని గదులను పరిశీలించారు. డీవైఈఓ మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభం కాకముందే అడ్మిషన్లు నిర్వహించినా, క్యాంపెయిన్లు జరిపినా, విద్యా సామగ్రిని విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

గ్రామాల్లో గొడవలకు దిగితే చర్యలు


లేపాక్షి: ప్రజలకు సూచనలిస్తున్న సీఐ ఈరన్న


సోమందేపల్లి: బైక్ ఆర్‌సీని తనిఖీ చేస్తున్న పోలీసులు

లేపాక్షి: మండలంలోని కల్లూరు, కొండూరు గ్రామాల్లో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. మంగళవారం ఉదయం హిందూపురం రూరల్ సీఐ ఈరన్న, ఎస్‌ఐ గోపీతో పాటు పోలీసు సిబ్బంది రౌడీషీటర్ల ఇళ్లను తనిఖీ చేయడంతో పాటు కౌన్సిలింగ్ ఇచ్చారు. అలాగే రికార్డులు లేని 10 వాహనాలను సీజ్ చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో పబ్లిక్ మీటింగ్ ఏర్పాటు చేసి ప్రజలకు పలు సూచనలు చేశారు. కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి గొడవలకు దిగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టినా చర్యలు తప్పవన్నారు.

సోమందేపల్లి: కౌంటింగ్ సందర్భంగా ఎవరైనా అల్లర్లకు దిగితే కఠిన చర్యలు తప్పవని సీఐ యుగంధర్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని చాలకూరు గ్రామంలో పోలీసులతో సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానిత వ్యక్తుల ఇళ్లలో సోదాలు చేపట్టారు. ఎస్‌ఐలు విజయ్‌కుమార్, సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

జోరుగా ఇంటింటి సర్వే

మడకశిరరూరల్: దివ్యాంగులు, బడిఈడు పిల్లలను గుర్తించి బడిలో చేర్పించడానికి సర్వే నిర్వహిస్తున్నామని సహిత విద్య (భవిత కేంద్రం) ఉపాధ్యాయుడు బుచ్చయ్య తెలిపారు. ఇంటింటి సర్వే ద్వారా 25 మందిని గుర్తించామని , అందులో 15 మంది పిల్లలను 1వ తరగతిలో చేర్పించామన్నారు. మిగిన వారిని భవిత, అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు చేయించామన్నారు.

మెనూ ప్రకారం వడ్డించాలి

గోరంట్ల: మండలంలోని ప్రాథమిక , ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు, హెల్పర్లకు మంగళవారం స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో, మండల విద్యాశాఖ అధికారులు అవగాహన కల్పించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందించాలని, ముఖ్యంగా పరిశుభ్రత పాటించాలని ఎంఈఓ గోపాల్ సూచించారు.

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి

పెనుకొండ: పట్టణంలోని వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ నిర్వాహకులు యాడికి నాగరాజు, సుధాకర్‌గుప్తా, ప్రగతి శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. 28 నుంచి జూన్ 2 వరకూ బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయన్నారు. 30న రథోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు.

సోమందేపల్లిలో జైనుల పాదయాత్ర


పాదయాత్రగా వస్తున్న జైన మత గురువు ప్రసన్న సాగర్ జీ

సోమందేపల్లి: కర్ణాటకకు చెందిన జైన మత గురువు ప్రసన్న సాగర్ జీ పాదయాత్ర మంగళవారం సాయంత్రం సోమందేపల్లికి చేరుకుంది. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఆయన రాత్రికి విడిది చేశారు. స్వామిని కలవడానికి గ్రామస్తులు విడిది ప్రాంతానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. సమాజంలో ప్రతి ఒక్కరూ శాంతియుతంగా జీవించాలని ఆయన భక్తులకు సూచించారు. మహారాష్ట్రలోని నాందేడ్ వరకూ పాదయాత్ర కొనసాగనుందన్నారు. ఎస్‌ఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.


జ్యోతులు మోస్తున్న భక్తులు

వైభవంగా జ్యోతుల ఉత్సవం


కాళికాదేవిని ఊరేగిస్తున్న దృశ్యం

అగళి: మండల పరిధిలోని హెచ్‌డీ హళ్లి పంచాయతీ తండా గ్రామంలో కాళికాదేవి, యల్లమ్మ, ఆంజనేయస్వామి, వేంకటేశ్వరస్వామి జ్యోతుల ఉత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. తండాకు చెందిన మహిళలు భక్తిశ్రద్ధలతో బియ్యం పిండితో చేసిన చెలిమిడిని జ్యోతులుగా చేసుకొని గ్రామం నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రదక్షిణలు చేసిన తర్వాత అమ్మవారికి సమర్పించారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

31న ఎండీఎం నిర్వాహకులతో సమీక్ష

రొళ్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 31వ తేదిన అన్ని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం భోజనం పథకం వంట చేస్తున్న నిర్వాహకులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఎంఈఓ శ్రీధర్ తెలిపారు. ఎండీఎం నిర్వాహకులు సమీక్ష సమావేశానికి తప్పక హాజరు కావాలని కోరారు.

సర్వేయర్ వైఖరిపై రైతుల ఆగ్రహం

పావగడ: సర్వేయర్ మంజునాథ్ తప్పుడు పత్రాలు సృష్టించి నిజమైన లబ్ధిదారులకు అన్యాయం చేశారంటూ స్థానిక రాజ్య రైతు సంఘం అధ్యక్షుడు పూజారప్ప తదితరులు తాలూకా కార్యాలయ ఆవరణలో మంగళవారం ఆందోళనకు దిగారు. తాలూకాలోని కిలార్లహళ్లిలో భీమప్ప కుటుంబ సభ్యులకు చెందిన నాలుగు ఎకరాల భూమిని తప్పుడు పత్రాలతో అనుభవంలో లేని రంగధామప్ప పేరుతో చేశారన్నారు. సర్వేయర్ మంజునాథ్‌పై చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని తహసీల్దార్ సంతోష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ తప్పనిసరిగా బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళన విరమించారు.